ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
మంచిర్యాల
జిల్లా వార్తలు




కార్పొరేట్ కళాశాలల
అడ్మిషన్ల వేట

- పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు
- ఫలితాలు రాకముందే ముందస్తు అడ్మిషన్లు
- ఆకర్షణీయమైన బ్రోచర్లు, ఫీజులో రాయితీతో వల

జైపూర్, ఏప్రిల్ 13: హలో నమస్కార మండి.. మీ పాప, బాబు పదో తరగతి అయి పోయింది ఇంటర్‌కు ఏం ప్లాన్ చేస్తున్నారు... మాది కార్పొరేట్ కాలేజీ. ఐఐటీ, మెయిన్స్ ఏసీ, నాన్ ఏసీ స్పెషల్ బ్యాచ్‌లు ఉన్నాయి... ఇప్పుడు జాయిన్ అయితే డిస్కౌంట్ కూడా ఇస్తున్నాం. ఫలితాలు వచ్చాక సీట్లు ఉండవు. ఫీజులు పెరుగుతాయి... ఇది జిల్లాలోని పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు రోజు వస్తున్న ఫోన్‌కాల్స్... ఇంటర్ కాలేజీల యాజమాన్యాల ప్రత్యేకంగా పీఆర్‌వోలను నియమించుకుని ప్రవేశాల కోసం గాలం వేస్తున్నాయి.

తాము పడిన కష్టాలు తమ పిల్లలు పడకూడదని తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారు. కూలీ పనులు చేసైనా సరే మంచి కళాశాలలో చదివించాలనే ఆలోచనలో ఉన్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని అందిన కాడికి దోచుకునేందుకు కార్పొరేట్ కళాశాలలు సిద్ధమవుతున్నాయి. ఆకట్టుకునేలా బ్యాచ్‌కో పేరు పెట్టి రంగు రంగుల బ్రోచర్లు చూపి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం పదో తరగతి ఫలితాలు రాక ముందే నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్‌ల వేట ప్రారంభించారు.

జిల్లాలో కళాశాలలు...

జిల్లాలో ప్రభుత్వ కళాశాలలు 10, ప్రైవేటు కళాశాలలు 20, సొసైటీ కళాశాలలు 36 ఉన్నాయి. మొత్తం 66 కళాశాలలు ఉన్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా

పదో తరగతి పరీక్షల ఫలితాలు వెలువడిన తర్వాత మే, జూన్ నెలల్లో అడ్మిషన్‌లు ప్రారంభించాలి. అయితే నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాల ప్రక్రి య నిర్వహి స్తున్నా విద్యా శాఖ అధికారులు పట్టించు కోవడం లేదనే ఆరోపణలు విని పిస్తున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

టార్గెట్ పెడుతూ..

కొన్ని యాజమాన్యాలు పీఆర్‌వోలను ప్రత్యేకంగా నియమించుకుని ఏడాది పాటు వేతనాలు ఇస్తున్నాయి. అడ్మిషన్‌లు ఎక్కువగా చేసిన వారికి ఇన్సెంటివ్‌లు అందజేస్తున్నాయి. మరో వైపు సంబంధిత కళాశాలలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది, అధ్యాపకులు తప్పకుండా 25 మంది అడ్మిషన్‌లు తీసుకురావాలని టార్గెట్‌లు పెడుతున్నారు. వేసవిలో తరగతులు ఉండకపోవడం తో వారికి సగం వేతనమే చెల్లిస్తున్నారు. ప్రవేశాలు చేసిన వారికి ఇన్సెంటివ్, కొంత కమీషన్ ఇస్తున్నారు. ఎవరైనా అడ్మిషన్‌లు చేస్తే సాధారణ కళాశాలలకు వెయ్యి రూపాయలు, కార్పొరేట్ కళాశాలలకు రూ. 5 వేల వరకు, హాస్టల్ క్యాంపస్ ఉన్న కళాశాలల్లో చేర్పిస్తే 2,500 అంద జేస్తున్నాయి.

ఆఫర్‌లతో ఆకట్టుకునేలా....

ఆయా కళాశాలలు నియమించుకున్న పీఆర్‌వోలు విద్యార్థుల ఇండ్ల వద్దకు క్యూ కడుతున్నారు. మూడు నెలల ముందు నుంచే ఈ తతంగం మొదలైంది. వీరు పాఠశాలలకు వెళ్లి విద్యార్థుల వివరాలు ఫోన్ నెంబర్లు, చిరునామా సేకరిస్తున్నారు. వివరాలు ఇచ్చినందుకు పాఠశాలల యాజమాన్యాలకు విందులు, నజరానాలు సమకూర్చుతున్నారు. నిబంధనల ప్రకారం విద్యార్థుల వివరాలు ఎవరికి ఇవ్వరాదు. కానీ కాసులకు కక్కుర్తి పడి కొన్ని ప్రైవేటు పాఠశాలలు ఈ విధంగా వ్యవహరి స్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన పలు కళాశాలల వారు జిల్లాలో పీఆర్ వోలను నియమించుకున్నారు. వారు ఉదయం నుంచి రాత్రి వరకు విద్యార్థుల ఇండ్లకు వెళ్లి బ్రోచర్లు ఇవ్వడం, వారి కళాశాలల గురించి వివరిస్తున్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించండి : శైలజ, డీఐఈవో

ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాప కుల ఆధ్వర్యంలో నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. తల్లిదండ్రులు ఆలోచించి పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలి. ప్రభుత్వ కళాశాలల్లో ఉచితంగా అడ్మిషన్‌లతో పాటు పాఠ్యపుస్తకాలు అందిస్తున్నాం. స్కాలర్‌షిప్ కూడా పొందవచ్చు. తల్లిదండ్రులు ఆలోచించి ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలి.

ఎన్నికల విధులకు వెళ్తున్న హోంగార్డులకు దిశానిర్దేశం

ఏసీసీ, ఏప్రిల్ 13 : తమిళనాడులో జరిగే సాధారణ ఎన్నికల విధులకు వెళ్తున్న రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హోంగార్డులకు సీపీ శ్రీనివాస్ శనివారం దిశా నిర్దేశం చేశారు. ఈ నెల 19న తమిళనాడులో జరగనున్న ఎన్నికల విధుల్లో 64 మంది హోంగార్డులు వెళ్తున్నారు. హోంగార్డులతో నిర్వహించిన సమావేశంలో సీపీ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్నికల విధులు పకడ్బందీగా, క్రమశిక్షణతో నిర్వహించాలని సూచించారు. కమిషనరేట్‌కు, రాష్ట్ర పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విలువైన ఆభరణాలు, వస్తువులను వెంట తీసుకువెళ్లవద్దని సూచించారు. విధులకు వెళ్తున్న సిబ్బందికి మెడిసిన్ కిట్‌లు, మస్కిటో నెట్‌లు అందించారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

జన్నారం, ఏప్రిల్ 13 : మండలంలోని సోనాపూర్ తండా, బంగారు తండాలకు చెందిన 50 మంది బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు శనివారం ఉట్నూరులో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముజఫర్ ఆలీఖాన్, ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సుగుణ, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణ అందరి బాధ్యత


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ప్లాంటేషన్ మేనేజర్, కూలీలకు అటవీ సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి

జైపూర్, ఏప్రిల్ 13: అడవులు, పెంచుతున్న ప్లాంటేషన్‌లు మానవ నిర్లక్ష్యంతో మంటలు చెలరేగితే పర్యావరణానికి ఎంతో నష్టం వాటిల్లుతుందని అటవీ అభివృద్ధి సంస్థ మంచిర్యాల రేంజ్ 1 ప్లాంటేషన్ మేనేజర్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ముదిగుంట సమీపంలో రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థకు చెందిన నీలగిరి ప్లాంటేషన్‌లో రేంజ్ 2 ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మణ్‌తో కలిసి గ్రామస్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేసవిలో అటవీ ప్రాంతం మీదుగా వెళ్లే వారిలో కొందరు బీడీలు, సిగరెట్ తాగి నిర్లక్ష్యంగా పడేయడం వల్ల అడవికి నిప్పు అంటుకుని ప్రమాదాలు జరుగుతాయన్నారు. అడవులు, ప్లాంటేషన్‌లు ఆహుతవుతే పర్యావరణానికి విఘాతం కలుగుతుందన్నారు. దీంతో మానవాళి మనుగడతోపాటు ఇతర జీవరాశులకు నష్టం కలుగుతుందన్నారు. చెట్లు సమృద్ధిగా పెరిగితే వర్షాలు బాగా కురుస్తాయని, కాలుష్యం తగ్గుతుందని పేర్కొన్నారు. ప్లాంటేషన్‌లో అగ్ని ప్రమాదాల నివారణకు సహకరించాలని సూచించారు. మంటలు అంటుకుంటే అటవీ అధికారులకు సమాచారం ఇచ్చి ఆర్పివేసేందుకు కృషి చేయాలన్నారు. అటవీ సిబ్బంది రాజేష్, శ్రీనివాస్, శంకర్, సాయికిరణ్, లచ్చన్న, ఓదెలు, రాకేష్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: అడవిలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే జంతువులు, మొక్కలు జీవజాతికి ప్రమాదం జరుగుతుందని, అగ్ని ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని తాళ్లపేట అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి ప్రమోద్‌కుమార్ అన్నారు. తాళ్లపేటతో పాటు గిరిజన గ్రామాల్లో ఉపాధి కూలీలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పశువుల కాపర్లు, రోడ్డుపై వెళ్లేవారు సిగిరెట్, బీడీలు వేయడం, వంట చేసుకొని మంటను ఆర్పకపోవడం వల్ల నిప్పురవ్వలు గాలిలో కలిసి అడవిలో ఆకులపై పడితే అగ్గి ఏర్పడుతుందన్నారు. అడవిలో చిన్నగా మంట కనిపించినా వెంటనే ఆర్పివేయాలన్నారు. ప్రతీ ఒక్కరు అడవుల సంరక్షణకు పాటుపడాలన్నారు. ఎఫ్ఎస్‌వో గోవింద్, ఎఫ్‌బీవో అమృత్‌రావు, పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలు నిబంధనలకు లోబడి వైద్యం అందించాలి


మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుబ్బారాయుడు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 13: జిల్లాలోని గ్రామీణ వైద్యులు (ఆర్ఎంపీ, పీఎంపీ) పరిమితికి మించి వైద్య సేవలు అందించకూడదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుబ్బారాయుడు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఆర్ఎంపీ, పీఎంపీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్యం అందించేచోట ప్రథమ చికిత్స కేంద్రం అని ఉండాలని, ఈ కేంద్రంలో పడకలు, ఎలాంటి నమూనా మందులు ఉండవద్దని తెలిపారు. వేసవి ఉష్ణోగ్రత కారణంగా వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవాల్సిన చర్యలు, పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వడదెబ్బకు గురైన వారికి ప్రాథమిక చికిత్స చేసి సమీప ఆసుపత్రులకు తరలించాలన్నారు. ఏమైనా సమస్య లుంటే వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు తెలియజేయాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకొంటామన్నారు. వైద్యులు శివ ప్రతాప్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, జిల్లాలోని 285 మంది ఆర్ఎంపీ, పీఎంపీలు పాల్గొన్నారు.

టెట్ లేకుండా ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలి


జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏసీసీ, ఏప్రిల్ 13: టెట్‌తో సంబంధం లేకుండా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజ వేణు అన్నారు. శనివారం టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం అనుమతి తీసుకుని పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను చెల్లించాలని, వేసవి సెలవుల్లో బదిలీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆగాచారి, కిరణ్, అబ్దుల్ వాహిద్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణంలో టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు చక్రపాణి జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. రవికుమార్, బబిత, రమేష్, చక్రవర్తి, నాగరాజు, సతీష్, స్వర్ణలత, సునీత, సుజాత, సునంద దేవి తదితరులు పాల్గొన్నారు.

చిత్తాపూర్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం

నెన్నెల, ఏప్రిల్ 13: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిత్తాపూర్‌లో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన 56 మందికి పరీక్షలు నిర్వహించగా 30 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వారిని కరీంనగర్ జిల్లా రేకుర్తికి తీసుకెళ్లి ఆపరేషన్లు చేసి కంటి అద్దాలు అందజేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ కె.సుగుణాకర్‌రెడ్డి, జోనల్ చైర్మన్ గుర్రాల చక్రధర్‌రావు, అధ్యక్షుడు చైతన్య చంద్రరాజు, కార్యదర్శి ఎస్. మధూకర్, ట్రెజరర్ శ్రీధర్, జి. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ

కాసిపేట, ఏప్రిల్ 13: మల్కేపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు ఇల్లు కాలిపోయిన రాంచందర్ కుటుంబానికి శనివారం మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సరుకులు, రూ.5 వేల నగదును అందించారు. కుటుంబానికి తమ వంతు సహాయ సహకారాలు అందించి ఆదుకుంటామని సీఐ తెలిపారు. కష్టాల్లో ఉన్న వారికి ప్రతీ ఒక్కరు ముందుకు వచ్చి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, పోలీసులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి


ప్రచారం చేస్తున్న కొప్పుల ఈశ్వర్, దివాకర్‌రావు

ఏసీసీ, ఏప్రిల్ 13 : బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని పెద్దపల్లి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర థియేటర్ నుంచి శ్రీనివాస థియేటర్ వరకు షాపుల్లో ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓట్లు వేయాలని వ్యాపారులను కోరారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో బీజేపీలు ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి స్వార్థ ప్రయోజనాల కోసం పని చేస్తున్నాయన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలు అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా బీఆర్ఎస్ పని చేస్తుందన్నారు. యువ నాయకుడు విజిత్‌రావు, సత్యం పాల్గొన్నారు.

ఎస్ఏ2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

దండేపల్లి, ఏప్రిల్ 13 : ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఈనెల 15 నుంచి జరిగే ఎస్ఏ2 వార్షిక పరీక్షలకు అన్ని సిద్ధం చేసినట్లు మండల విద్యాధికారి కాసుల రవీందర్ పేర్కొన్నారు. శనివారం ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఐసీ, సీఆర్‌పీలు తరగతుల వారీగా, సబ్జెక్టు వారీగా ప్రశ్నాపత్రాలను సిద్ధం చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు.

సుందరకాండ హోమం

బెల్లంపల్లి, ఏప్రిల్ 13: చంద్రవెల్లి గ్రామంలోని సోమేశ్వరస్వామి ఆలయంలో శనివారం వేద పండితులు సుందరకాండ హోమం నిర్వహించారు. ప్రజలతోపాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు హోమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ సూరిబాబు, టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి, మల్లేష్, సురేష్, దామోదర్‌గౌడ్, అశోక్‌గౌడ్, ఆంజనేయస్వామి భక్తులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటి తొట్టీలు



మందమర్రిరూరల్, ఏప్రిల్ 13: మండల వ్యాప్తంగా ఉపాధిహామీ పథకంలో పశువుల దాహార్తిని తీర్చడానికి నీటి తొట్టీలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి నిరుపయోగంగా మారడంతో నీటి కోసం మూగ జీవాలు అల్లాడుతున్నాయి. మండలంలోని శంకర్‌పల్లి, సండ్రోన్‌పల్లిలోని నీటి తొట్టీలు చెత్తా, చెదారంతో నిండిపోయి నిరుపయోగంగా ఉన్నాయి. సారంగపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న నీటి తొట్టీని ఇటీవల ఏర్పాటు చేసిన పార్కులో కలపడంతో ఇది పశువులకు అందుబాటులో లేకుండా పోయింది. అందుగులపేట గ్రామపంచాయతీ ఎదురుగా ఉన్న నీటి తొట్టీని ఇటీవల తొలగించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి తొట్టీల్లో నీరు నింపాలని పశువుల యజమానులు కోరుతున్నారు.

నీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సతీష్

నస్పూర్, ఏప్రిల్ 13: నస్పూర్ మున్సిపాలిటీలోని 25 వార్డుల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా వార్డుల ఇన్‌చార్జీలు చర్యలు చేపట్టాలని కమిషనర్ చిట్యాల సతీష్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం వేసవి నీటి ఎద్దడిపై ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించారు. ఏ వార్డులోనైనా నీటి సమస్య ఉన్నట్లయితే వెంటనే పరిష్కరించాలని సూచించారు. పైపులైన్ల లీకేజీలు, నల్లా కనెక్షన్లు సమస్య వచ్చిన తక్షణమే స్పందించి పరిష్కరించాలన్నారు. మున్సిపాలిటీలో నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను చేసినట్లు తెలిపారు. సమావేశంలో 25 వార్డుల ఇన్‌చార్జీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేత


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

హాజీపూర్, ఏప్రిల్ 13: మండలంలోని దొనబండ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో రాణి లక్ష్మీబాయి రక్ష ప్రశిక్షణ ఆత్మరక్షణ కార్యక్రమంలో భాగంగా శిక్షణ పొందిన బాలబాలికలు శనివారం పాఠశాల స్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఇందులో నైపుణ్యం ప్రదర్శించిన బాల బాలికలకు ప్రధానోపాధ్యాయుడు హన్మాండ్లు ప్రశంసాపత్రాలు, ఆరెంజ్, ఎల్లో బెల్టులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ బాలబాలికలు తప్పనిసరిగా ఆత్మరక్షణ విద్యనేర్చుకోవాలని సూచించారు. శిక్షకుడు రమేష్ పాల్గొన్నారు.

బీపీ మండల్ వర్ధంతి


మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏసీసీ, ఏప్రిల్ 13: బీపీ మండల్ కమిషన్ సిఫార్సుల అమలుపై జాతీయ పార్టీలు వైఖరిని స్పష్టం చేయాలని తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో బీపీ మండల్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయడంలో కేంద్రంలోని కాంగ్రెస్, బీజేపీలు నిర్లక్ష్యం వహించాయని, వెంటనే వీటిని అమలు చేయాలన్నారు. పట్టణాధ్యక్షుడు వైద్య భాస్కర్, పొట్టాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

తైబజార్ రద్దు చేయడం హర్షణీయం


కూరగాయల మార్కెట్‌లో నిర్వహించిన సమావేశంలో వ్యాపారులు, కాంగ్రెస్ నాయకులు


ఏసీసీ, ఏప్రిల్ 13: మంచిర్యాల మున్సిపాలిటీలో తైబజార్‌ను రద్దు చేయడం హర్షణీయమని కూరగాయల వ్యాపారులు, చిరు వ్యాపారులు అన్నారు. శనివారం కూరగాయల మార్కెట్‌లో నిర్వహించిన సమావేశంలో కూరగాయల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ తైబజార్ రద్దు వల్ల చిరు వ్యాపారులకు ఆర్థిక వెసలుబాటు కలిగిందన్నారు. గతంలో తైబజార్ పేరిట రోజు కూరగాయల వ్యాపారులు, ఇతర వీధి వ్యాపారులు, చిరు వ్యాపారుల నుంచి మున్సిపాలిటీలో టెండర్ పాడిన కాంట్రాక్టర్ పన్ను వసూలు చేసేవారన్నారు. తైబజార్‌ను రద్దు చేయించినందుకు ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు తూముల నరేష్, పూదరి తిరుపతి, జోగుల సదానందం తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయింపు


బైఠాయించిన శైలజ

మందమర్రిటౌన్, ఏప్రిల్ 13: పట్టణంలోని లక్ష్మీభవానీ కాలనీకి చెందిన సాయి అనే యువకుడి ఇంటి ఎదుట గోదావరిఖనికి చెందిన శైలజ శనివారం బైఠాయించింది. ఆమె మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల క్రితం సాయి ఫేస్‌బుక్‌లో పరిచయమయ్యాడని తెలిపింది. 2022లో వివాహం చేసుకున్నామని తెలిపింది. రామగుండంలో తనను అద్దె ఇంట్లో ఉంచాడని తెలిపింది. తమ వివాహాన్ని సాయి తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదని తనను వదిలేశాడని, తన వద్దకు రావడం లేదని, మందమర్రిలోని ఇంటికి తీసుకువెళ్లడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. రెండో పెళ్లికి సిద్ధమవుతున్నాడని తెలుసుకుని మందమర్రికి వచ్చానని తెలిపింది. తనకు న్యాయం జరిగే వరకు ఇక్కడే ఉంటానని తెలిపింది. కాలనీ వాసులు వచ్చి శైలజతో సాయి ఇంటికి తాళం వేసి ఉందని, పెద్దలను తీసుకుని రావాలని చెప్పడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి వెళ్లిపోయింది.





పోలీసుల ఆధ్వర్యంలో కళాజాతా

వేమనపల్లి, ఏప్రిల్ 13: ముల్కలపేటలో శుక్రవారం రాత్రి నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్ ఆధ్వర్యంలో పోలీసు కళాబృందం సభ్యులు మూఢనమ్మకాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ మూఢనమ్మకాలను ప్రజలు నమ్మవద్దని, అనారోగ్యంగా ఉంటే ఆసుపత్రులకు వెళ్లాలని సూచించారు. యువతీ, యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత విద్యను చదువుకుని మంచి ఉద్యోగాలు సాధించాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

సామాజిక తనిఖీ బృందానికి సహకరించాలి

మందమర్రిరూరల్, ఏప్రిల్ 13: ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ జరుగుతుందని, బృందానికి సహకరించాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో, పని స్థలాల్లో తనిఖీ చేస్తుందన్నారు. ఎస్ఆర్‌పీ దేవేందర్, ఏపీవో రజియాసుల్తానా పాల్గొన్నారు.

హన్మాన్ దీక్షల స్వీకరణ

దండేపల్లి, ఏప్రిల్ 13: గూడెం సత్యనారాయణస్వామి దేవాలయంలోని అంజనేయస్వామి మందిరంలో శనివారం హనుమాన్ భక్తులు దీక్షలు స్వీకరించారు. సుమారు 700 మందికి పైగా మంది భక్తులు తరలివచ్చి మాల ధారణ చేశారు. ఈనెల 23న హనుమాన్ జయంతి పురస్కరించుకొని 11 రోజుల పాటు దీక్ష ను స్వీకరించారు.




















బీజేపీ అభ్యర్థి గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం



బెల్లంపల్లిలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, మంచిర్యాలలో మాట్లాడుతున్న పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్

ఏసీసీ, ఏప్రిల్ 13: పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ గెలుపుతోనే అభివృద్ధి జరుగుతుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాధ్ అన్నారు. శనివారం గోపాలవాడ, హమాలీవాడ, అశోక్ రోడ్డులో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పదేళ్ళ పాలనలో అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేశారన్నారు. పేద ప్రజలకు ఉచిత బియ్యం, వీధి వ్యాపారులకు పీఎం సమ్మాన్ నిధి రుణాలు, రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి, పీఎం ఆవాస్ యోజన ద్వారా పేదలకు ఇండ్లు, ఉచిత కరోనా టీకాల వంటి అనేక పథకాలను అమలు చేశారన్నారు. కేంద్రం నిధులతోనే రోడ్లు, శ్మశాన వాటికలు, రహదారులు, డంపింగ్‌యార్డులు నిర్మాణమవుతున్నాయన్నారు. మంచిర్యాలలో జాతీయ రహదారులు, రామగుండంలో ఎరువుల కర్మాగారం ప్రారంభించారన్నారు. జైన్, పురుషోత్తం, హరికృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ ఈ ఎన్నికల్లో గెలిస్తే ప్రజలకు అందుబాటులో ఉండడని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాధ్ అన్నారు. శనివారం నియోజకవర్గ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో గడ్డం వినోద్‌ను గెలిపిస్తే హైద్రాబాద్‌కే పరిమితం అవుతున్నాడని, వంశీ గెలిస్తే ప్రజలకు అందుబాటులో ఉండడన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి ఓట్లు వేసి గెలిపించాలన్నారు. పలువురు పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. నాయకులు సుదర్శన్‌గౌడ్, రజనీష్ జైన్, వెంకటకృష్ణ, అశోక్, సంతోష్‌కుమార్, శ్రీకృష్ణదేవరాయలు, పురుషోత్తం, సుధీర్‌గౌడ్, విజయ్, మహీదర్‌గౌడ్, కమల, రజిని, పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: బీజేపీకి అన్ని వర్గాల మద్దతు లభిస్తుందని, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఎంఆర్‌పీఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నాడని, వీటిని ప్రజలు నమ్మరన్నారు. వివేక్ వెంకటస్వామి కుటుంబ సభ్యుల కుల ధ్రువీకరణ పత్రాలను ప్రజల ముందు ఉంచాలని, కేవలం ఎన్నికల్లో లబ్ధి కోసమే దళిత కార్డు వాడుతున్నారన్నారు. ఒకే ఇంట్లో నుంచి ముగ్గురు పోటీ చేయడం పట్ల ప్రజలు పెదవి విరుస్తున్నారన్నారు. ఈ నెల 15న జరిగే సభకు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరు కానున్నారని తెలిపారు. ప్రజలందరు బీజేపీకి ఓట్లు వేసి గెలిపించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, ఏమాజీ, రామయ్య, ఎల్లయ్య, సమ్మయ్య, శరత్ పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం



ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

ఏసీసీ, ఏప్రిల్ 13: మంచిర్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్, వినాయక టెంపుల్‌ల ఎదురుగా హెల్ప్ సొసైటీ సభ్యులు చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. శనివారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య ప్రారంభించారు. సొసైటీ ఫౌండర్ సైమన్, కళ్యాణ్ ప్రసాద్, నరేష్, రాజు, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌కు సన్మానం

మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్యను ఎల్‌ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు శనివారం ఆయన నివాసంలో సన్మానించారు. అధ్యక్షుడు పాలమాకుల రాజబాబురెడ్డి, గాదాసు శ్రీనివాస్, ముక్త శ్రీనివాస్, గంగాధరి తిరుపతి, మహేష్ పాల్గొన్నారు.

మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మధుకర్

ఏసీసీ, ఏప్రిల్ 13 : మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జిల్లా కేంద్రానికి చెందిన పొట్ట మధుకర్ నియమితులయ్యారు. శనివారం జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు పొట్ట మధుకర్‌ను రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు, దళితుల హక్కుల సాధనకు మాలమహానాడు నిరంతరం పోరాడుతుందన్నారు. నారాయణ, మల్లేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి అరెస్టు

బెల్లంపల్లి, ఏప్రిల్ 13: కన్నాల బస్తీకి చెందిన దుర్గం రాజేష్ అనే వ్యక్తి ఇంటి ఆవరణలో గంజాయి సాగు చేస్తుండగా పట్టుకున్నట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. రాజేష్ గంజాయి సాగు చేస్తున్నాడనే సమాచారం మేరకు ఎస్‌ఐ రమేష్, సిబ్బందితో రాజేష్ ఇంటికి వెళ్లి తనిఖీలు చేయగా గంజాయి మొక్కలు కనిపించాయన్నారు. 14 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. రాజేష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. గంజాయి సాగు, రవాణా, సేవించినా చర్యలు తీసుకుంటామన్నారు.

వేములవాడలో జిల్లావాసి అరెస్ట్

వేములవాడ రూరల్: సిరిసిల్ల జిల్లా వేములవాడలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ నాగేంద్రచారి అన్నారు. వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనపరచుకున్నామన్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శ్యామ్‌దివాకర్, వేములవాడకు చెందిన మల్లికార్జున్, కామారెడ్డికి చెందిన కట్కూరి భాను, మంచిర్యాలకు చెందిన పరికి పండ్ల అన్వేష్ అలియాస్ బన్ని, వేములవాడ పట్టణం సుభాష్‌నగర్‌కు చెందిన మర్రిపల్లి సురేష్‌లను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

బీసీల పట్ల బీజేపీ వైఖరి మారాలి

నస్పూర్, ఏప్రిల్ 13: బీజేపీ ప్రభుత్వం బీసీల పట్ల పక్షపాత వైఖరి అవలంబిస్తుందని, పార్టీ తీరు మార్చుకోవాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. సీసీసీ కార్నర్‌లో పట్టణ నాయకుల సమావేశం శనివారం జరిగింది. శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల కాంగ్రెస్ పార్టీ మేనిఫేస్టోలో సమగ్ర కుల గణన చేస్తామని, బీసీలకు 50శాతం రిజర్వేషన్ల కల్పిస్తామని పేర్కొందన్నారు. బీజేపీ కూడా మేనిపెస్టోలో బీసీల డిమాండ్లను చేర్చాలన్నారు. పట్టణ అధ్యక్షుడు మహేష్, లక్ష్మన్, చంద్రమౌళి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

దండేపల్లి, ఏప్రిల్ 13: ద్వారకలో శీతల్‌దేవి పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో గణపతి పూజ, మంటపారాధన కార్యక్రమాలు రవి అయ్యగారు ఆధ్వర్యంలో జరిగాయి. ద్వారక ఆలయ కమిటీ నిర్వాహకులు, సభ్యులు, పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే బీసీల అభివృద్ధి

మందమర్రిటౌన్, ఏప్రిల్ 13: రాజ్యాధికారంతోనే బీసీల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని బీసీ ఐక్యవేదిక నాయకులు రంగు రాజేశం, శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. శనివారం మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీలకు రావాల్సిన హక్కులు అమలు కాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. బీసీలను చైతన్యవంతం చేసేందుకు యాత్ర చేపట్టామని పేర్కొన్నారు. రాజ్యాంగంలో బీసీలకు రావాల్సిన హక్కులను అమలు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, పోరాటాల ద్వారా సాధించుకోవాలన్నారు. బీసీలు రాజకీయ, విద్య, ఉద్యోగాలపరంగా అణిచివేతకు గురవుతున్నారని, వీటిని సాధించేందుకు బీసీలందరు కదం తొక్కాలన్నారు. మల్లయ్య, ముత్తయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సహాయం

మందమర్రిటౌన్, ఏప్రిల్ 13: పట్టణంలోని మూడో జోన్‌లోని 7, 8 వార్డులకు చెందిన మేకల శ్రీనివాస్, ప్రతాప్‌సింగ్, కల్వల శ్రీనివాస్‌లు అనారోగ్యంతో బాధపడుతుండగా శనివారం పట్టణ మిత్ర సభ్యులు వారిని పరామర్శించారు. ఒక్కొక్కరికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. పట్టణ మిత్ర వ్యవస్థాపకుడు గుడ్ల రమేష్, మహంత్ అర్జున్‌కుమార్, మంద తిరుమల్‌లు మాట్లాడుతూ మేకల శ్రీనివాస్‌కు కాలు తొలగించారని, దీంతో ఇంటికి పరిమితమయ్యాడని, ప్రతాప్‌సింగ్‌లు అనారోగ్యంతో మంచం పట్టారని విషయం తెలుసుకుని ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. సభ్యులు పాషా, ప్రభాకర్, రాజేష్, రాము, సత్యనారాయణ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

ఏసీసీ, ఏప్రిల్ 13 : దోపిడీ కేసులో తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలు వెల్లడించారు. ఈ నెల 6న ఆటో కోసం వేచి ఉన్న బొప్పు మల్లేష్‌ను రంగపేటలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి కత్తితో బెదిరించి కొట్టి రూ.4 వేల నగదు, వాచ్ దొంగిలించిన కేసులో ఆండాళమ్మ కాలనీకి చెందిన దారంగుల రాజ్‌కుమార్‌ను ఏసీసీ క్వారీ ఏరియాలో పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ కేసులో చెన్నూరి రవిని ఈ నెల 8న అరెస్టు చేసినట్లు తెలిపారు.

ఆత్మహత్యకు కారణమైన ఒకరి అరెస్టు

జన్నారం, ఏప్రిల్ 13 : జన్నారం గ్రామానికి చెందిన తోకల రాకేష్ ఆత్మహత్యకు కారకులైన కడెంకు చెందిన లింగాల ప్రభాకర్‌ను శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్‌ఐ రాజవర్ధన్ తెలిపారు. కడెం నీటిపారుదల శాఖలో పనిచేస్తున్న రాకేష్‌ను అవమానపరుస్తూ వేధింపులకు గురి చేయడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇరిగేషన్ కార్యాలయంలో పనిచేస్తున్న లింగాల ప్రభాకర్, శ్రీనివాస్‌లపై రాకేష్ తల్లి తోకల సరస్వతి ఫిర్యాదు చేశారు. ప్రభాకర్‌ను అరెస్ట్ చేశామని, మరో నిందితుడు శ్రీనివాస్‌కు కోర్టు బెయిల్ ఇచ్చిందని తెలిపారు.

వడ్డీ వ్యాపారులపై పోలీసుల ఉక్కుపాదం

- జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో దాడులు
- ఇళ్లలో సోదాలు
- రూ.23లక్షలు, పలు డాక్యుమెంట్ల స్వాధీనం



దాడులు నిర్వహిస్తున్న ఎఎస్పీ ప్రభాకర్ రావు, డీఎస్పీ కరుణాకర్

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్, ఏప్రిల్ 13: వడ్డీ వ్యాపారం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్న ఫిర్యాదుల మేరకు జిల్లా పోలీసుయంత్రాంగం వడ్డీవ్యాపారులపై ఉక్కుపాదం మోపింది. శనివారం ఎస్పీ సురేష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాలతోపాటు రెబ్బెన, వాంకిడి మండలకేంద్రాల్లో ఏకకాలంలో దాడులునిర్వహించారు. ఏఎస్పీ ప్రభాకర్ నేతృత్వంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డీఎస్పీలు సదయ్య, కరుణాకర్ ఆధ్వర్యంలో ఎస్సైలు, సీఐలు పలు బృందాలుగా ఏర్పడి జిల్లాలో వడ్డీ, చీటీ వ్యాపారుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో పోలీసులు నగదు, ఖాళీ చెక్‌లు, నాన్ జ్యుడీషియల్ బాండ్స్, ప్రామిసరీ నోట్లు, ఏటీఎం కార్డులను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన ఈ దాడుల్లో ఆసిఫాబాద్‌లో శ్రీనివాస్, దత్తు, కాగజ్‌నగర్ పట్టణంలో సాబీర్, రాజశేఖర్, సంతోష్, వాంకిడిలో రవి, కార్తీక్ వద్ద నుంచి రూ.23లక్షల నగదు, పలు డాంక్యుమెంట్లను స్వాధీన పర్చుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడులు..-ఏఎస్పీ ప్రభాకర్

జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా వడ్డీ, చీటీవ్యాపారం చేస్తున్న వారిపై ఎస్పీ సురేష్ ఆదేశాల మేరకు సోదాలు నిర్వహించాం. చీటీ వ్యాపారం చేసేందుకు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసి ఉండాలి. లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తాం. కాగజ్‌నగర్‌లో ఐదుగురి ఇళ్లపై దాడులుచేశాం. ఉదయం నుంచి ఈ దాడులు చేయగా, కనీసం ఆరు గంటలపాటు చేసినట్టు వివరించారు. సమావేశంలో డీఎస్పీ కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐ శంకరయ్య

కాగజ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 13: అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను టౌన్‌సీఐ శంకరయ్య శనివారం ఆవిష్కరించారు. ఈనెల 14నుంచి 22వరకు అగ్నిమాపక వారోత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫైర్ ఆఫీసర్ మురళీమోహన్‌రెడ్డితో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫైర్‌మెన్లు హర్షద్, యుగందర్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



యువతకు వాలీబాల్ కిట్‌ను అందజేస్తున్న ఎస్సై నరేష్

చింతలమానేపల్లి, ఏప్రిల్ 13: యువత క్రీడల్లో రాణించాలని ఎస్సై నరేష్ అన్నారు. శనివారం పోలీసు స్టేషన్‌లో కర్జవెల్లి గ్రామానికి చెందిన యువకులకు వాలీ బాల్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, సన్మార్గంలో నడవాలని సూచించారు.

టోల్‌ప్లాజా వద్ద రూ.1.10లక్షలు పట్టివేత

వాంకిడి, ఏప్రిల్ 13: మండలంలోని టోల్‌ప్లాజావద్ద ఉదయం వాహనాల తనిఖీలు చేస్తుండగా సరైన ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1,10,000 నగదును పట్టుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపినవివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని రాజురాకు చెందిన గజానంద్ కారులో రాజురానుంచి మంచిర్యాలకు వెళ్తుండగా అతని వద్ద రూ.1.10,000 నగదు పట్టుకున్నట్లు తెలిపారు. ఆధారాలు లేని కారణంగా నగదును సీజ్‌చేసి ఎస్ఎస్‌టీ టీఎంకు అప్పగించినట్లు తెలిపారు.

ఘనంగా టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 13: ఆసిఫాబాద్ పట్టణంలో టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, హేమంత్ సిండె, రమేష్, ఊశన్న, తిరుపతి, ఉపేందర్, నరేందర్, దేవాజీ, శ్రీనివాస్, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీచైర్మన్ కోలుకోవాలని ప్రార్థనలు చేసిన కోనప్ప

కాగజ్‌నగర్, ఏప్రిల్ 13: కాగజ్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ సద్దాం హుస్సేన్ అనారోగ్యం బారిన పడగా త్వరగా కొలుకోవాలని శనివారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప స్థానిక ఇర్ఫాన్‌నగర్‌లోని దర్గాలో ప్రార్థనలు నిర్వహించారు. ఆయన వెంట దస్తగిర్, కౌన్సిలర్లు ఉన్నారు.



ప్రార్థన చేస్తున్న మాజీఎమ్మెల్యే కోనప్ప

ఇలా అయితే వ్యాధులు రావా?



ఎల్కపల్లిలో బావి వద్ద మురికి నీరు

బెజ్జూరు, ఏప్రిల్ 13: మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో మంచినీటి బావి చుట్టూ మురికి నీరు నిల్వ ఉండటంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. బావి వద్ద నీరు నిల్వ ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. గతంలో పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకపోయినా పూడిక తొలగించడం లేదని పేర్కొంటున్నారు. గ్రామసర్పంచ్‌లు పదవీకాలం పూర్తి కావడంతో గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించారు. అయితే ప్రత్యేకాధి కారులు గ్రామాల్లో పర్యటించిన దాఖలాలు లేవు. దీంతో గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. గ్రామాలకు ప్రత్యే కాధికారులు ఎవరో కూడా తెలియడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో తమ సమస్యలు ఎవరికిచెప్పుకోవాలో గ్రామస్తులు తెలియడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బావిచుట్టూ ఉన్న మురికి కాల్వల్లో పూడిక తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

వడ్డీ వ్యాపారుల ఇళ్లలో సోదాలు

వాంకిడి, ఏప్రిల్ 13: మండల కేంద్రంలో వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్న తాటిపల్లి రవి, బుట్లే కార్తీక్ ఇళ్లలో శనివారం ఉదయం పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్ని డాక్యుమెంట్లు, చెక్కులు, డైరీ, డబ్బులు స్వాధీనం చేసుకొని తాటిపల్లి రవి, బుట్లే కార్తీక్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ తెలిపారు. వడ్డీ వ్యాపారం చేస్తున్న తాటిపల్లి రవి వద్ద రూ.1,65,000 నగదుతోపాటు డాక్యుమెంట్లు, బుట్లే కార్తీక్‌వద్ద రూ.81,100 నగదుతో పాటు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు



డబ్బాలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

చింతలమానేపల్లి, ఏప్రిల్ 13: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని డబ్బా, ఆడెపల్లి గ్రామాల్లో శనివారం కేంద్రబలగాలతో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. ప్రజలు ఎలాంటిప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటర్లంద రికీ రక్షణగా తామున్నామని ధైర్యం ఇచ్చేందుకు ఈ కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా సీతారామ విగ్రహాల ప్రతిష్ఠాపన

చింతలమానేపల్లి, ఏప్రిల్ 13: మండలంలోని దిందా గ్రామంలో శనివారం సీతారాముల విగ్రహప్రతిష్ఠాపన కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో పూజలు నిర్వహించి వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. బ్రాహ్మణుల వేదమంత్రోచ్ఛరణల మధ్య అంగరంగ వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



- పెరుగుతున్న రసాయన ఎరువుల వినియోగం
- సేంద్రియ ఎరువులపై అవగాహన కరువు
- భూసార పరీక్షలకు సరఫరా కాని రసాయనాలు
- అవగాహన కల్పిస్తే మేలు

భూసారం తగ్గుతోంది

బెజ్జూరు, ఏప్రిల్ 13: పెరుగుతున్న రసాయన ఎరువుల వినియోగం... సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం, సహజ ఎరువుల వాడకం పూర్తిగా తగ్గించడంతో ఏటా భూమిలో రసాయనాల ప్రభావం పెరిగి భూసారం తగ్గుతోంది. రసాయనాల గాడత ఏటా పెరిగిపోతున్న తీరుతో భూములు పూర్తిగా సారం కోల్పోయి రానున్న కాలంలో చవుడు భూములుగా మారిపోయే ప్రమాదం ఉంది. సాంకేతిక పరిజ్ఞానం రోజు రోజుకు పెరుగుతున్నప్పటికీ రైతులకు దీనిపై అవగాహన కల్పించడం లేదు. ఈ రెడీమేడ్ వ్యవసాయంతో భవిష్యత్తులో భూములు పంటలకు అనువుగా ఉండే పరిస్థితి లేదని వ్యవసాయ శాస్త్రవేత్తలు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే రైతులు దిగుబడి అధికంగా రావాలంటూ ఎరువులు, పురుగు మందులు గతం కంటే రెట్టింపుగా వినియోగిస్తుండటంతో దీర్ఘకాలంలో భూముల సారంపై ప్రభావం పడనుంది.

దూరంగా భూసార పరీక్షలు..

2020వరకు భూసార పరీక్షలు చేయించే బాధ్యత వ్యవసాయశాఖ సిబ్బందికి ఉండగా నాలుగేళ్లుగా ఈ తరహా లక్ష్యాలు నిర్ణయించలేదు. రైతులే తమ ఆసక్తితో వచ్చి భూసారపరీక్షలు చేయించుకోవాలని సూచించగా ఆశించిన మేర రైతులు ముందుకు రావడం లేదు. భూసార పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు ఏటా తగ్గిపోతున్న తీరు రైతుల అనాసక్తికి అద్దం పడుతోంది. రైతు వేదికలు నిర్మించిన సమయంలో భూసార పరీక్షల కిట్లు అందుబాటులో ఉంచి రైతులకు అవసరమైనప్పుడు పరీక్షలు చేయించాలని నిర్ణయించారు. అయితే కిట్లు ఇచ్చి రసాయనాలు అందించలేదు. కొన్నిచోట్ల రసాయనాలు అయిపోగా ఇప్పటివరకు సరఫరా చేయలేదు. జిల్లాలో రైతులు ఎక్కువగా పత్తి, వరి పంటల సాగుపై దృష్టిసారించడంతో ఇతర పంటలసాగు తగ్గిపోయింది. వరి పంటను సైతం తొలగించి పత్తి సాగు చేస్తున్నారు. వరికి సైతం ఎకరాకు ఒకబస్తా యూరియా సరిపోతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నా ప్రైవేటు కంపనీల మాటలు విని రైతులు మూడు బస్తాల వరకు యూరియా వినియోగిస్తున్నారు. దీనితో భూములు విషతుల్యం అవుతున్నాయి. యూరియా లీటర్ బాటిళ్లలో తయారు చేయిస్తూ ప్రభుత్వం రెండేళ్లుగా విక్రయిస్తున్నా వీటిని వినియోగించేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు.

ఆసక్తి ఉంటే పరీక్షలు చేయిస్తాం..
రాజులనాయుడు, వ్యవసాయ అధికారి, బెజ్జూరు



భూసార పరీక్షలపై రైతులకు ఆసక్తి ఉంటే పరీక్షలు చేయిస్తాం. మూడేళ్లుగా ప్రభుత్వం భూసార పరీక్షలపై ఎటువంటి లక్ష్యాలు ఇవ్వడం లేదు. దీంతో రైతులు భూసార పరీక్షలు చేయించుకునేందుకు ముందుకు రావడం లేదు. మూడేళ్లుగా రసాయనాల సరఫరా కూడా ఆగిపోయింది. రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలి. గతంలో వాటిపై రైతులకు పలుమార్లు అవగా హన కార్యక్రమాలు నిర్వహించినా ఆసక్తి చూపడం లేదు. పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి. సేంద్రియ ఎరువు ల వాడకం పెరిగినప్పుడే భూసారం కోల్పోకుండా ఉంటుం ది. రైతు లు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటిస్తూ ఎప్పటికప్పుడు పంటల మార్పిడి చేయాలి. రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి.

రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



ఆసిఫాబాద్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఆసిఫాబాద్, ఏప్రిల్ 13: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు గెలిచి రాహుల్‌గాంధీని ప్రధానమంత్రి చేయడమే తమ లక్ష్యమని మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం జిల్లాకేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో నిర్వహించిన నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ కాంగ్రెస్‌పార్టీని కుటుంబపాలన అని ఆరోపిస్తున్నారని వారిది కుటుంబ పార్టీ కాదని త్యాగాల కుటుంబమన్నారు. ఇందిరాగాంధీ, రాహుల్‌గాంధీ దేశంకోసం ప్రాణత్యాగాలు చేశారన్నారు. తెలంగాణకోసం వేలాదిమంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలనతో రాష్ట్ర సంపదనంత దోచుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ స్థానానికి డమ్మీ అభ్యర్థిని పెట్టారని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఫైర్ అయి కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్ నోరు అదుపులో ఉంచుకోవాలని అధికారం కోల్పోయినా బుద్ధి రావడంలేదని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అండగా ఉండే పార్టీ అని బలుపు ఉన్న వారికి కాంగ్రెస్ టికెట్ ఇవ్వదన్నారు. గత ఎన్నికలలో ఖానాపూర్ అభ్యర్థి బొజ్జు చేతిలో కేటీఆర్ స్నేహితులు జాన్సన్‌నాయక్ పరిస్థితి ఏమైందో అప్పుడే మర్చిపోయారా అని ప్రశ్నించారు?. పార్లమెంట్ ఎన్నికల్లో సుగుణక్కను గెలిపించి మరోసారి దొరల అహంకారానికి బుద్ధి చెప్పాలన్నారు. దేవుని పేరుతో బీజేపీ రాజకీయం చేస్తుందని ప్రజలు అభివృద్ధిని అడిగితే అక్షింతలు పంపుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ ఆదిలాబాద్ పర్యటనకు వచ్చినపుడు ఈ ప్రాంత అభివృద్ధికి ఎలాంటి హామీ ఇవ్వకపోవడం అభివృద్ధిపై ఆ పార్టీకి ఉన్న చిత్తశుద్ధిని చెబుతుందన్నారు. దేశంలో బీజేపీకి వ్యతిరేకించే నాయకులపై ఈడీ, సీబీఐ, ఐటీ దాడులకు దిగుతోందన్నారు. బీజేపీ ప్రభుత్వంఎస్సీ పేరుతో ప్రజల కష్టాన్ని దోచుకుంటోందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను భారీ మెజార్టీతో గెలిపించి దేశ ప్రధానిగా రాహుల్‌గాంధీని చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు. నాయకులు, కార్యకర్తలు బూత్ స్థాయిలో కాంగ్రెస్‌పార్టీకి భారీమెజార్టీ తీసుకువచ్చేందుకు సైనికుల్లా పనిచేయాలన్నారు. నియోజకవర్గంలో పార్టీకి లక్ష మెజార్టీ తీసుకురావాలన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటూ అభివృద్ధికి నిధులు సమకూర్చే బాధ్యత తనదని భరోసా కల్పించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ రెండు ఒకటేనన్నారు. బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులుగా ఉన్న ఆత్రం సక్కు, గెడం నగేష్ గతంలో చట్టసభల్లో పనిచేసినా ఏనాడూ ఈ ప్రాంత అభివృద్ధి కోసం మాట్లాడలేదన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్‌నాయక్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, పీసీసీ కార్యదర్శి సత్తు మల్లేష్, సిర్పూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ అనిల్‌గౌడ్, నాయకులు బాలేశ్వర్‌గౌడ్, మసాదే చరణ్, వసంత్, ఆసద్, గుండా శ్యాం, మహేష్‌గౌడ్, ఆసిఫ్, మంగ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు..

ఆసిఫాబాద్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని మంత్రి సీతక్క అన్నారు. శనివారం పట్టణంలోని ప్రేమలగార్డెన్‌లో నిర్వ హించిన నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆసిఫాబాద్, వాంకిడి, రెబ్బెన మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన రెబ్బెన జడ్పీటీసీ వేముర్ల సంతోష్, వాంకిడి ఎంపీపీ ముండే విమలబాయి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గాదవేణి మల్లేష్, నంబాల మాజీ సర్పంచ్ సోమశేఖర్, మాజీ ఆత్మ చైర్మన్లు మరిశెట్టి రమేష్, కురాట్కార్ రమేష్, ఆరె సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు జయరాం తదితరులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాత, కొత్త తేడా లేకుండా ప్రతి ఒక్కరు పార్టీ కోసం పని చేయాలన్నారు.

ప్రశ్నించే గొంతుకకు పట్టం కట్టాలి..

రెబ్బెన: త్వరలో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకకు పట్టం కట్టాలని జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క అన్నారు. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున ఆదిలాబాద్ పార్లమెంటు స్థానానికి పోటీచేస్తున్న ఆదివాసీ బిడ్డ సగుణను అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంటుకు పంపించాలని ఆమె అన్నారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెల్పించాలన్నారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీజడ్పీటీసీ ప్రకాష్‌రావు, నంబాల మాజీ సర్పంచి అమృత, పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం గంగాపూర్ ఆలయంలో ఆమె పూజలు నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్, నియోజకవర్గ ఇన్‌చార్జీ శ్యామనాయక్, రెబ్బెన పార్టీ అధ్యక్షుడు రమేష్, కిషన్‌గౌడ్, తిరుపతి పాల్గొన్నారు.

మంత్రికి వినతుల వెల్లువ..

రెబ్బెన మండలానికి పర్యటనకు వచ్చిన మంత్రి సీతక్కకు అంగన్‌వాడీ టీచర్లు తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు.

బజ్జీలు వేసిన మంత్రి సీతక్క.

ఎన్నికల ప్రచారంలో భాగంగా సీతక్క రెబ్బెనలో ప్రచారంచేస్తూ మిర్చిబండి వద్దఆగి బజ్జీలువేసి ఓటర్లను ఆకట్టుకున్నారు. మంత్రి స్థాయిలో ఉండి కూడా బజ్జీలు వేయటంపై మండల వాసులు అభినందించారు.



పార్టీలో చేరిన వారికి కండువ కప్పుతున్న మంత్రి సీతక్క

హనుమాన్ మాల స్వీకరణ



హనుమాన్ మాల స్వీకరిస్తున్న భక్తులు

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 13: జిల్లాకేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం 400మందికిపైగా భక్తులు హనుమాన్ మాలను స్వీకరించారు. దీంతో తెల్లవారుజాము నుంచే ఆలయప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధానఅర్చకుడు ఒజ్జల శిరీష్‌శర్మ ఆధ్వర్యంలో పండితులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. అనంతరం భక్తులతో మాలధారణ చేయించి దీక్ష పలితాలను, నియమాలను వివరించారు. ఆలయ ప్రాంగణం జైశ్రీరాం.. జైహనుమాన్ నినాదాలతో మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వెంకన్న, వివేక్, రాధాకృష్ణాచారి, ప్రకాష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 13: అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. శనివారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో రికార్డులను స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏఈవో రెహమాన్ ఉన్నారు.



ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్న యాజమాన్యం: ఏఐటీయూసీ



విలేకరులతో మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్, ఏప్రిల్ 13: సింగరేణి యాజమాన్యం ప్రభుత్వం అడుగులకు మడుగులొత్తుతోందని ఏఐటీయూసీ అధ్యక్షుడు వి సీతారామయ్య ఆరోపించారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు సంఘంగా తాము గెలుపొందినప్పటికీ గుర్తింపు పత్రం ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారన్నారు. పైగాఎన్నికల కోడ్ ఉందంటూ బుకాయిస్తున్నారని ఆరోపించారు. సింగరేణి అధికారులు కూడా ఏ ప్రభుత్వం ఉంటే వారికి అనుకూలంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. వివిధ కమిటీల సమావేశాలు నిలిచిపోతున్నాయని, దీనివల్ల కార్మికుల సమస్యలు పెండింగ్‌లో పడిపోతున్నాయన్నారు. రిటైర్డ్ కార్మికులకు రిటైర్‌మెంట్ రోజే హెల్త్‌కార్డులు ఇవ్వాలని, రూ.8 లక్షల వైద్య ఖర్చులను ట్రస్టు బోర్డు భరించుకోవాలని తదితర డిమాండ్లు చేశారు. సమావేశంలో యూనియన్ డిప్యూటీ ప్రధానకార్యదర్శులు కె వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, గునిగంటి నర్సింగరావు, అఫ్రోజ్‌ఖాన్, ప్రసాదరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి సందర్భంగా రక్తదానం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 13: అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే8 డిస్పెన్సరీలో 80మంది కార్మికులు రక్తదానం చేశారు. ముఖ్యఅతిథులుగా ఎస్సీ లైజన్‌అధికారి కె కిరణ్‌కుమార్, డీజీఎం(ఐఈడి) చిరంజీవులు హాజరై మాట్లాడారు. అంబేద్కర్ ఆశయాలసాధనకు కృషిచేయాలని అన్నారు. ఆయన రచించిన రాజ్యాంగం వల్లే ఎంతో మంది బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఏరియాఉపాధ్యక్షుడు దేగలప్రవీణ్‌కుమార్, సుమన్, రాజేశ్,రాజునాయక్,లక్ష్మణ్,కార్మికులు,రెడ్‌క్రాస్‌సభ్యులు పాల్గొన్నారు.

జైపూర్: అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఎస్టీపీపీలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని ఎస్టీపీపీ ఓఅండ్ఎం చీఫ్ జేఎన్‌సింగ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానశిబిరంలో అధికారులు, కార్మికులు రక్తదానం చేయాలన్నారు. చాలా మంది అనారోగ్యంతో బాధపడుతున్న వారు రక్తంఅందక చనిపోతున్నారని పేర్కొన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందించారు.



రక్తదాతకు ప్రశంసాపత్రం అందిస్తున్న జీఎం

సమస్యల పరిష్కారానికి హామీపై హర్షం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 13: తమ సమస్యలు పరిష్కరించేందుకు యాజమాన్యం అంగీకరించడంపై రిటైర్డ్ కార్మికులు హర్షం వ్యక్తంచేశారు. కొత్తగూడెం సింగరేణి ప్రధానకార్యాలయంలో శనివారం జరిగిన సీపీఆర్ఎంఎస్ సమావేశానికి ఏఐటీయూసీ నాయకులు, అధికారులు హాజరయ్యారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ట్రస్ట్‌బోర్డు సమావేశం నిర్వహించడానికి యాజమాన్యం అంగీకరించిందన్నారు. విశ్రాంత కార్మికులు క్యాన్సర్, గుండె, మూత్రపిండాలు, పక్షపాతం లాంటి క్రిటికల్ జబ్బుల వైద్యానికి రూ.8లక్షలు ఖర్చుచేసేవారికి ఇక నుంచి సింగరేణి యాజమాన్యమే భరించనుందన్నారు.

గతంలో ఖర్చుచేసిన వారికి సైతం తిరిగి వారి ఖాతాలో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇతర ముఖ్య సమస్యల పరిష్కరించేందుకు కృషి చేసిన ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు వి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాధవ్, కార్యవర్గ సభ్యులు సుద్దాల లక్ష్మీనారా యణ, కొట్టె మల్లయ్య, నాగేశ్వర్ రావు, ప్రకాష్ రావు, శ్రీనివాస్, సుర్జీత్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 13: అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దామని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(ఎస్‌సీకేఎస్-సీఐటీయూ) డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్ అన్నారు. అంబేద్కర్ జయంతిని శనివారం శ్రీరాంపూర్ ఓసీపీ, బంగ్లాస్ ఏరియాలో నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్మికుల హక్కుల సాధనకు ఉద్యమించి, వారికి న్యాయం చేయడమే అంబేద్కర్‌కు అర్పించే నివాళి అని అన్నారు. కేంద్రప్రభుత్వం కార్మికుల హక్కులను హరించేలా చట్టాలను తీసుకు రావడాన్ని ముకుమ్మడిగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగరాజు, రమేష్, తిరుపతి, రాజేందర్, కోమల, లక్ష్మి, అశోక్, ప్రభాకర్, పుష్ప, రవీందర్ పాల్గొన్నారు.